సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 19 । జనవరి । 2024



పురుగు మందు కొంటేనే..
భీమ్‌గల్ మండలంలో ఫర్టిలైజర్స్ దుకాణదారులు పురుగు మందు కొంటేనే యూరియా ఇస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.
- 8లో ▸



వర్ని ఏఎంసీలో అవినీతి
జిల్లాలోని వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలో సుమారు రూ. 5 లక్షల విలువైన మోటార్లు మాయమయ్యాయి.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.9 /20.2

వాతావరణం
ఆకాశం ఉదయం నుంచి నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25కుగాను 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఈబీసీల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, దరఖాస్తుకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం

మోర్తాడ్ : యాసంగి సీజన్ పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడంలో జరిగిన అంతరాయానికి ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటి వరకు ఎకరంన్నర భూమి ఉన్న రైతులకు రైతుబంధు జమ చేయగా గురువారం రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం జమ చేశారని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 5వ తేదినాటికి 98,583 మంది రైతులకు రూ.28.29 కోట్లు జమ చేశారు. బుధవారం జిల్లాలో పర్యటించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గురువారం నుంచి పెట్టుబడి సాయం జమ చేయడం ప్రారంభిస్తామని చెప్పారు. ఆయన చెప్పినట్లుగానే రెండు ఎకరాల్లోపు రైతులకు పెట్టుబడి సొమ్మును జమ చేశారు. విడతల వారీగా ఈనెలాఖరు వరకు జిల్లాలో ఉన్న అందరు రైతులకు పెట్టుబడి సాయం జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

బాలికల సంరక్షణకు కృషి చేయాలి



మోపాల్ : బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా సంక్షేమాధికారి రసూల్ బీ పేర్కొన్నారు. గురువారం మోపాల్ రైతు వేదికలో బాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాలికల సంరక్షణ, భ్రూణ హత్యల నివారణ, మహిళల చట్టాలు, బాల్యవివాహాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లకు రసూల్ బీ వివరించారు. ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి, సూపర్‌వైజర్ జకీరా, ఏపీఎం మోహన్, మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ స్వప్న, సౌమ్య, పుష్ప, డీహెచ్‌ఈ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో రమేష్, శ్యాం సుందరి పాల్గొన్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు బదులుగా 'ఆధార్'

ఆర్మూర్ : ఇకపై డేట్ ఆఫ్ బర్త్ (పుట్టిన తేదీ ధృవీకరణ) సర్టిఫికెట్‌కు బదులుగా ఆధార్ కార్డునే పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సంజీవ్ యాదవ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వ్యక్తికి ఆధార్ నంబర్‌ను కేటాయించిన తర్వాత ఆధార్ చట్టం– 2016 తో పాటు అక్కడ రూపొందించిన నిబంధనల ప్రకారం నిర్దేశించిన వివిధ మోడ్‌ల ద్వారా అతను తన గుర్తింపు అవసరాలకు దాన్ని ఉపయోగించవచ్చని వివరించారు.

శ్రీరాముని లడ్డూ ప్రసాదానికి ఘన స్వాగతం



పెర్కిట్(ఆర్మూర్) : హైదరాబాద్ నుంచి అయోధ్య వెళ్తున్న శ్రీరాముని లడ్డు ప్రసాదానికి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో బీజేపీ నాయకులు, అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు గురువారం ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని వెస్ట్ మారేడుపల్లి శ్రీరామ క్యాటరింగ్ సర్వీసెస్ యజమాని నాగభూషణ్ రెడ్డి అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన వరకు రోజుకు కిలో చొప్పున 1,265 కేజీల లడ్డూను తయారు చేయడానికి సంకల్పించారు. తయారు చేసిన లడ్డూను విగ్రహ ప్రతిష్ఠాపన రోజు ప్రసాదంగా అందజేసేందుకు అయోధ్యకు తీసుకెళ్తున్నారు. పెర్కిట్‌కు చేరుకున్న లడ్డు ప్రసాదానికి నాయకులు స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ద్యాగ ఉదయ్, పాలెపు రాజు, దుగ్గి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. వంచించి..

- సిద్ధుల గుట్ట అభివృద్ధికి సహకరించిన వారికి నమ్మకద్రోహం
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరో వ్యవహారం వెలుగులోకి..
- పనులు చేయగా వచ్చిన బిల్లులను ఇవ్వకుండా మోసం చేసిన వైనం
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఎన్ఆర్ఐ లేఖ

అధికారంలో ఉన్న సమయంలో పలువురిని అనేక బెదిరింపులకు గురిచేసిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేకు సంబంధించి తాజాగా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు మాజీ ఎమ్మెల్యే తమకు నమ్మకద్రోహం చేసినట్లు సిద్ధుల గుట్ట అభివృద్ధి కమిటీ తరఫున బాబు అనే ఓ ఎన్ఆర్ఐ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సిద్ధులగుట్ట అభివృద్ధి కోసం పాటుపడిన తమకు అన్యాయం చేయడమేమిటని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్ధుల గుట్ట డెవలప్‌మెంట్ కోసం తమకు రూ.8 కోట్ల మేర ఖర్చయిందని, అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చినప్పటికీ జీవన్‌రెడ్డి తమకు చెల్లించకుండా మోసం చేసినట్లు సదరు వ్యక్తులు వాపోతున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

ఆర్మూర్ పట్టణంలోని సిద్ధుల గుట్ట అభివృద్ధి కోసం 20 మంది ఆలయ కమిటీ సభ్యులుగా ఏర్పడ్డారు. ఇందులో భాగంగా 2018 ఫిబ్రవరి 27న సిద్ధుల గుట్ట రోడ్డు అభివృద్ధి కోసం సనుగుల బాబు భూమిలో ఉన్న గుట్ట లాంటి ప్రాంతాన్ని తొలిచి ఇందులోని మెటల్, మొరాన్ని ఈ ప్రాజెక్టుకు ఉపయోగించుకునేలా మొదటి ఒప్పందం రాసుకున్నారు. ఇందుకోసం కమిటీ సభ్యులు సంతకాలు చేశారు. తర్వాత రెండో ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్టుకు రాళ్లు, మొరం ఎక్కువగా అవసరమున్న నేపథ్యంలో కమిటీ రూ. 8 కోట్ల ప్రభుత్వ నిధుల మంజూరు లేఖ, ఆర్మూర్ మున్సిపాలిటీ నుంచి రూ.2 కోట్లు ఇచ్చేలా నిర్ణయం జరిగింది. ఆరు నెలల్లో పెట్టిన డబ్బులు తిరిగి వస్తాయని హామీ వచ్చింది.

ప్రభుత్వం నిధులు విడుదలైనప్పుడు తనతో పాటు సిద్ధుల గుట్ట కమిటీకి ఖర్చు చేసిన అదనపు మొత్తాన్ని దామాషా ప్రకారం (ఖర్చుచేసిన శాతం) పంచుకునేలా రెండో ఒప్పందంలో రాసుకున్నారని బాబు పేర్కొన్నారు. ఈ ఒప్పందంపై కమిటీ సభ్యులు సంతకాలు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం రూ.8 కోట్లు (వడ్డీతో కలిపి) వెచ్చించినట్లు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికీ ఆర్మూర్, హైదరాబాద్, సిమ్లా, యూఎస్ఏలలో చక్రవడ్డీలు చెల్లిస్తున్నట్లు సనుగుల బాబు పేర్కొన్నారు.

తన సర్వీసులో 25 ఏళ్ల సేవింగ్స్, రిటైర్మెంట్ ఫండ్‌లను ఈ ప్రాజెక్ట్‌లో ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో సిద్ధుల గుట్ట అభివృద్ధి కోసం చేసిన కమిటీ సభ్యులందరూ ఏకమై కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రెస్‌మీట్ పెట్టి ఎవరెవరు ఎంత ఖర్చు చేశామో వివరాలు వెల్లడించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తంమీద సిద్ధుల గుట్టపై ప్రాజెక్ట్ పూర్తయితే, తెలంగాణలోని ఉత్తమ సందర్శన స్థలాల్లో ఒకటిగా మారుతుందని సనుగుల బాబు పేర్కొంటున్నారు. కంకర రోడ్డు పూర్తయ్యాక దానిని మంత్రి ప్రారంభించే రోజు కూడా (ప్రభుత్వం ప్రారంభించిన తేదీ వరకు ఒక్క పైసా చెల్లించలేదు) తాను రాళ్లు, మొరం, లేబర్ ఛార్జీలు, ట్రాక్టర్లకు పెట్రోల్, వాహనాలకు అద్దె ఛార్జీలు (80 శాతం) ఇచ్చినప్పటికీ తన పేరును ప్రజలకు చెప్పకపోవడమేమిటని వాపోయారు.



ఆర్మూర్‌లోని సిద్ధులగుట్టపైకి వెళ్లేందుకు నిర్మించిన రోడ్డు

కేటీఆర్‌కు చెప్పినా..

తనకు రావాల్సిన డబ్బుల విషయమై అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అడిగినప్పటికీ ఇవ్వకుండా నమ్మకద్రోహం చేసినట్లు పేర్కొన్నారు. ఇందు కోసం తాను భారత్‌కు రెండుసార్లు వచ్చినప్పటికీ ఫలితం లేదని ఆయన వాపోయాడు. ఈ క్రమంలో అప్పటి మంత్రి కేటీఆర్ సాండియాగోకు వచ్చినప్పుడు కలిస్తే, జీవన్‌రెడ్డితో మాట్లాడతానని చెప్పినట్లు లేఖలో పేర్కొన్నారు. తనకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో గత నాలుగేళ్ల గా తీవ్ర ఇబ్బందులతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్లు తెలిపాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో కమిటీ సభ్యులంతా కలిసి రెండుసార్లు పనులు నిలిపేయగా, జీవన్‌రెడ్డి మాత్రం ఫోన్‌చేసి త్వరలో నిధులు వస్తాయని, పనులు కొనసాగించాలని చెప్పడంతో పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు బిల్లులు రాకపోవడంతో ఇతర భాగస్వాములు తనను నిందిస్తున్నట్లు వాపోతున్నాడు.

సమస్యలపై చర్చ జరిగేనా!

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్ రూరల్ : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పూర్తిస్థాయిలో నిర్వహించే సమావేశానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు హాజరయ్యేనా అన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో జెడ్పీటీసీలు, అధికారులు తప్ప నియోజకవర్గ ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. సమావేశాలు తూతూ మంత్రంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలపై చర్చిస్తారా లేదా అని ప్రజలు అనుకుంటున్నారు. సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ప్రధానంగా చర్చ జరగనున్నట్లు తెలిసింది. దీంతోపాటు జిల్లాలో ప్రధాన సమస్యలు, ఇతరత్రా అంశాలు చర్చకు రానున్నాయి. గత తీర్మానాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన తీర్మానాలపై చర్చించనున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులపై..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ సభ్యులు చర్చించే అవకాశం ఉంది. జెడ్పీ సీఈవో గోవింద్ మాట్లాడుతూ.. 15 ఆర్థిక సంఘం నిధులపై సమావేశం కొనసాగుతుందని తెలిపారు. ఈ చర్చలో సంబంధిత అధికారులందరూ పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామస్థాయి, మండల స్థాయికి 15 ఆర్థిక సంఘం నిధులు ఎంత కేటాయించాలో చర్చలో వివరంగా తెలుపుతారని ఆయన తెలిపారు.



విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలి
- ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, సీఎండీ వరుణ్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం : ప్రజలకు గాలి, నీరు మాదిరిగా విద్యుత్ కూడా అత్యవసరమని ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. వినియోగదారులకు మెరుగైనా విద్యుత్ అందించాలని సూచించారు. గురువారం ఆయన జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో జిల్లా కేంద్రంలోని గోల్డెన్ జూబ్లీ మీటింగ్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. మెరుగైన సరఫరా కోసం విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్‌ను సక్రమంగా చేపట్టాలని సీఎండీ ఆదేశించారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బందికి రోజువారి పనుల లొకేషన్ ముందుగా తెలియజేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌లు పక్కాగా చేపట్టాలన్నారు. అవసరమైతే సిబ్బందికి శిక్షణనివ్వాలని సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ వినియోగదారులకు త్వరగా సర్వీసు రిలీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, సంధ్యారాణి, తిరుపతిరెడ్డి, ఎస్ఈ రవీందర్, డీఈటీ రమేష్, డీఈలు వెంకటరమణ, ముక్తార్, రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎట్టకేలకు ఎస్ఎంసీ ఎన్నికలకు మోక్షం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆరేళ్లుగా కమిటీలను పొడిగిస్తూ వచ్చిన పాలకులు
- 20వ తేదీన నోటిఫికేషన్
- 29న ఎన్నికలు

ఆర్మూర్ : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో కీలక భూమిక పోషించే పాఠశాల నిర్వహణ కమిటీ (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) నూతన పాలక వర్గం ఎన్నికకు ఎట్టకేలకు ఆరేళ్లకు మోక్షం లభించింది. ఆరేళ్ళ క్రితం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో పాలక వర్గం పదవీ కాలం రెండేళ్లు మాత్రమే ఉండగా గత ప్రభుత్వం పలు మార్లు పొడిగిస్తూ వచ్చింది.. కాగా ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాల నుండి వెళ్లిపోయినప్పటికీ వారి తల్లిదండ్రులు కమిటీల్లో ఉండటంతో పలుమార్లు వివాదాస్పదమైన సంఘటనలున్నాయి. కాగా రాష్ట్ర విద్యా శాఖ అధికారులు తాజాగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించడానికి షెడ్యూల్‌ను ఖరారు చేస్తూ గురువారం రాత్రి విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ దేవసేన, ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అనుసరించి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు పాఠశాల నిర్వహణ నూతన కమిటీల ఎన్నికలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. 9వ తరగతి, పదవ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీలో అవకాశం ఉండదు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటు హక్కు ఉన్న అర్హులైన తల్లిదండ్రుల పేర్లను నోటీస్ బోర్డ్‌పై ప్రదర్శించాలి. ఈనెల 23 వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరించాలి. అనంతరం 24వ తేదీ 11 గంటలకు తుది జాబితాను ప్రకటించాలి. 29వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. అదేరోజు ఎన్నికైన సభ్యుల నుంచి మధ్యాహ్నం 1:30 గంటలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకుంటారు. అనంతరం ఎన్నికైన చైర్‌పర్సన్ అధ్యక్షత మధ్యాహ్నం 2 గంటలకు మొదటి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. వీరి పదవీ కాలం రెండేళ్ల పాటు కొనసాగనుంది.

ముగిసిన 'ప్రజాపాలన' ఆన్‌లైన్ నమోదు

- 1,542 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో..
- 4,76,321 దరఖాస్తుల అప్‌లోడ్ పూర్తి
- నమోదు ప్రక్రియకు రూ.50 లక్షల బడ్జెట్‌కు ప్రతిపాదనలు

సుభాష్‌నగర్ /మోర్తాడ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై గ్రామ సభలు నిర్వహించి స్వీకరించిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని 676 జీపీలు, మున్సిపల్ వార్డుల్లో కలిసి డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీవరకూ దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆ వెంటనే దరఖాస్తుల అప్‌లోడ్ ప్రక్రియకు చేపట్టి ఈనెల 16వ తేదీనాటికి పూర్తి చేశారు. 1,542 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. కాగా దరఖాస్తుల అప్‌లోడ్ ప్రక్రియకు అవసరమైన సుమారు రూ. 50 లక్షల బడ్జెట్‌కు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

నిర్దేశించిన గడువుకు ముందే..

ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల అప్‌లోడ్ ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు ముందే జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. జనవరి 17లోగా అప్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. కానీ ఒక రోజు 16వ తేదీ నాటికే ఆన్‌లైన్ నమోదును పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 4,76,321 దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు.

ప్రజాపాలన దరఖాస్తుల అప్‌లోడ్ కోసం జిల్లా యంత్రాంగం 1,542 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ని ఆపరేటర్లు 792 మంది కాగా, ప్రైవేట్ ఆపరేటర్లు 750 మంది డేటా ఎంట్రీ చేశారు. ఒక్కో దరఖాస్తు కు ప్రభుత్వ ఆపరేటర్లకు రూ. 5 చొప్పున, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ. 15 చొప్పున చెల్లించేలా ఒప్పందం ఉంది. ఆ మేరకు 4,76,321 దరఖాస్తులకు గా ను సుమారు రూ. 50 లక్షల బడ్జెట్ అవసరమౌతుందని ప్రభుత్వానికి అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపించింది. త్వరలోనే బడ్జెట్ విడుదల కా నున్నట్లు తెలిసింది.

త్వరలో మార్గదర్శకాలు..?

ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముగిసింది. ఆ తర్వాత ఏంటనేది ప్రజల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కొత్త ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకున్న ప్రజల నుంచి ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడనున్నట్లు సమాచారం. దరఖాస్తుదారుడు తమ ఆధార్ జిరాక్స్ కాపీలను దరఖాస్తులకు జత చేయడంతో వారు కోరుకున్న పథకానికి అర్హుడు అవుతాడో కాదో ఆన్‌లైన్‌లోనే తెలిసిపోతుందనే వాదన వినిపిస్తుంది.

ఇంటింటికీ అధికారుల బృందాలు

పథకాలను లబ్ధి చేకూర్చడానికి అర్హులైన వారిని ఎలా ఎంపిక చేయాలనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికెళ్లి అధికారుల బృందం సర్వే నిర్వహిస్తుందనే ప్రచారం ఉంది. లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి అర్హతను ప్రామాణికంగా తీసుకుంటారనే విషయాన్ని ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేనే లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత రానుంది.



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

22న ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలి

ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్ : అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగే జనవరి 22న ప్రతి ఇల్లు దీపాల వెలుగులతో నిండిపోవాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. రామమందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. గురువారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ పాలన రామరాజ్యానికి దగ్గరగా ఉందన్నారు. 1947 నుంచి అయోధ్యపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, సమస్య జఠిలం కావడానికి ఆ పార్టీయే కారణమని ఆరోపించారు. సెక్యులర్ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే రామాలయాలు నిరాధారణకు గురవుతున్నాయని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ క్లోజ్ అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. ఈ నెల 25న అర్సాపల్లి వద్ద ఆర్‌వోబీకి శంకుస్థాపన ఉందని, అడవి మామిడిపల్లి ఆర్‌వోబీ నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. పసుపు బోర్డు ఆపరేషన్లు ఎప్పుడు ప్రారంభం అవుతాయని ప్రశ్నించగా ఇప్పటికే మొదలైందన్నారు. ఈ సీజన్‌లో పసుపు రూ.10వేలు క్వింటాలు పలుకుతుందని, పసుపు ధర రూ.20వేలు దాటే వరకూ నిద్రపోనని పేర్కొన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ఉద్యమిస్తానన్న కేటీఆర్ ప్రకటనపై ఎంపీ స్పందిస్తూ.. పదేళ్లలో ఏం చేశారని మండిపడ్డారు. 20 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని, వందలమంది అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి, నాయకులు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రవళిక, రాజశేఖర్‌రెడ్డి, శంకర్, సుక్కమధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేశ్ కులాచారి

స్వచ్ఛందంగా ఆలయాల శుద్ధిలో పాల్గొనాలి

నిజామాబాద్ సిటీ : అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆలయాల శుద్ధి కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఎంపీ అర్వింద్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, పార్టీ శ్రేణులతో కలిసి ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు మల్లేష్ యాదవ్, ఆకుల హేమలత శ్రీనివాస్, సుక్క మధు, ఇందుల మమత ప్రభాకర్, నారాయణ, నాయకులు బోధన్‌కర్ లక్ష్మీనారాయణ, రోషన్‌లాల్ బోరా, ఖిల్లా రామ్ మందిర్ అధ్యక్షుడు పుట్ట వీరేందర్ పాల్గొన్నారు.



ఖిల్లా రామాలయాన్ని శుద్ధి చేస్తున్న ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కులాచారి

సుభాష్‌నగర్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దినేశ్ కులాచారిని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి గురువారం నియమించారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బస్వా లక్ష్మీనారాయణను తప్పించారు. దినేశ్ కులాచారి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేసి సుమారు 50వేల ఓట్లు సాధించారు. దినేశ్ మొదట టీడీపీ తరపున జెడ్పీటీసీగా గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన భార్యకు పదవి ఇప్పించుకున్నారు. ఏడాదిన్నర పాటు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత ఎంపీ అర్వింద్ సమక్షంలో 2021లో బీజేపీలో చేరారు. ఎంపీ అర్వింద్ అండతో దినేశ్ కులాచారికి జిల్లా అధ్యక్ష పదవి వరించింది. జిల్లా అధ్యక్షుడిగా నియామకానికి కృషి చేసిన ఎంపీ అర్వింద్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి దినేశ్ ధన్యవాదాలు తెలిపారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి నియమించారు. పెద్దోళ్ల గంగారెడ్డి 2009 నుంచి 13 వరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, పలు జిల్లాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.



దినేశ్ కులాచారి



పెద్దోళ్ల గంగారెడ్డి

కలెక్టర్‌కు బాజిరెడ్డి ఫిర్యాదు

డిచ్‌పల్లి : గత ప్రభుత్వ హయాంలో తాను శంకుస్థాపన చేసిన వివిధ అభివృద్ధి పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి మళ్లీ రీలేయింగ్ చేస్తూ నిబంధనలు అతిక్రమించి కొత్తగా శంకుస్థాపనలు చేస్తున్నారని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ గత అక్టోబర్ 6న రూరల్ నియోజకవర్గంలోని ఇందల్వాయి మండలం 'వెంగల్‌పాడ్' వద్ద నిజామాబాద్– ధర్పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు 'మొరగు వాగు'పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, ధర్పల్లి మండలంలోని వాడి వద్ద మద్దుల్ – గడ్కోల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు ముత్యాల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామం వద్ద మద్దుల్– గడ్కోల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు కప్పల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను తాను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే పనులు కొనసాగుతున్నాయని అప్పటి శిలాఫలకాలను ధ్వంసం చేసి శుక్రవారం (19న) మరోసారి అవే పనులకు శంకుస్థాపన చేయడం నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. వీటిని తక్షణమే ఆపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పురుగు మందు కొంటేనే యూరియా!

- అవసరం లేకున్నా రైతులకు అంటగడుతున్న డీలర్లు, సహకార సంఘాలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- తప్పనిపరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



నిర్లక్ష్యంగా వ్యవసాయ శాఖ

భీమ్‌గల్‌: మండలంలోని ఫర్టిలైజర్‌ దుకాణదారులు రైతులను బ్లాక్‌మెయిల్‌ చేస్తున్నారు. యూరియా కావాలంటే గంట మందు, గడ్డి మందు, పురుగుల మందు, నానో యూరియా, కలుపు మందులు ఇలా తమ వద్దే తీసుకోవాల్సిందేనని లింకు పెడుతున్నారు. అవసరం లేకున్నా బలవంతంగా రైతులకు అంటగడుతున్నారు. పట్టించుకోవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు సైతం అటు వైపు చూడకపోవడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. దీంతో రైతులు అవసరం లేకపోయినా వాటిని కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

డీలర్లకు అధికారుల అండ..

భీమ్‌గల్‌ మండలంలో అధికారుల అండతో డీలర్లు రైతులను మోసం చేస్తున్నారు. ఎవరైన రైతులు ఖచ్చితంగా యూరియా అడిగితే అందుబాటులో లేదు.. ఇక్కడ ఉన్న యూరియాకు వేరే రైతులు ముందే డబ్బులు చెల్లించారు, వారికే ఆ యూరియాను ఇస్తామని చెబుతున్నారు. కొందరు డీలర్లు అయితే ఏకంగా మేము చెప్పినవి కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తాం లేదంటే యూరియా ఒక్క బస్తా కూడా ఇవ్వం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారు. ఆగ్రోస్‌, గ్రోమోర్‌, పలు ఫర్టిలైజర్‌ దుకాణాలతో పాటు రైతులకు అండగా ఉండాల్సిన సొసైటీల్లో కూడా రైతులకు బలవంతంగా లిక్విడ్‌ యూరియా, ఇతర మందులు అంటగడుతున్నారు. ఈ దందా బహిరంగంగానే కొనసాగుతున్నా.. మండల వ్యవసాయ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎరువుల వ్యాపారులు, సొసైటీలలో అధికారులు గడ్డి, కలుపు మందులు, నానో యూరియాను ఆఫర్లలో కొనుగోలు చేసి రైతులకు బలవంతంగా అంటగడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ స్వార్థం కోసం రైతులకు అవసరం లేని మందులను అంటగట్టి వాటిని వినియోగించేల చేస్తున్నారు. కొందరు రైతులు అవసరం లేకున్నా కొనడంతో వాటిని ఇంటి వద్దే ఉంచుతున్నారు. కొందరు కొనుగోలు చేశాం కదా అని అవసరం లేకున్నా పొలంలో పిచికారీ చేస్తున్నారు. దీంతో భూమి సారం కోల్పోవడమే కాకుండా, అదనపు భారం పడుతోంది.

నిర్లక్ష్యంగా వ్యవసాయ శాఖ

ఎరువుల డీలర్లు, సహకార సంఘాలు లింకు దందాలతో రైతులను మోసం చేస్తున్న వ్యవసాయ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాల్సిన వ్యవసాయశాఖ నామ మాత్రపు తనిఖీలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారులకు అందాల్సినవి అందుతుండడంతోనే వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యూరియా ఇవ్వమంటే ఇవ్వలేదు

నాకు రెండు ఎరువుల బస్తాలు ఇవ్వమని అడిగితే ఇవ్వలేదు. ఎందుకివ్వడం లేదని అడిగితే లిక్విడ్‌ యూరియా తీసుకుంటేనే యూరియా ఇస్తామన్నారు. అదనంగా డబ్బులు లేకపోవడంతో కొనుగోలు చేయలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రాజన్న, రైతు, బాబానగర్‌

కఠిన చర్యలు తప్పవు



రైతులకు అవసరమైన ఎరువులు, మందులే ఇవ్వాలి. వారితో బలవంతంగా వేరే మందులు కొనిపిస్తే చర్యలు తీసుకుంటాం. రైతులు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై శాఖా పరమైన చర్యలు తీసుకొని లైసెన్సులను రద్దు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సాయికృష్ణ, ఏవో, భీమ్‌గల్‌

అవినీతి @ వర్ని ఏఎంసీ

- సుమారు రూ. 5 లక్షలు విలువ చేసే 30 మోటార్లు మాయం
- తనకేమీ తెలియదంటున్న కార్యదర్శి


వడపోత యంత్రాలు

వర్ని: జిల్లాలోని వర్ని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ అవినీతికి మారుపేరుగా మారింది. ఈ ఏఎంసీలో సుమారు రూ. 5 లక్షలు విలువ చేసే కుంభకోణం జరిగింది. పర్యవేక్షించాల్సిన కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వడ్లను జల్లెడ పట్టే చెన్నింగ్‌ మిషిన్లకు ఉండే 30 మోటార్లు మాయమయ్యాయి. రూ. 16 వేలు విలువ చేసే 30 మోటార్లు మిషిన్ల నుంచి గల్లంతయ్యాయి. 2020లో జిల్లా మార్కెట్‌ కార్యాలయం నుంచి 40 జల్లెడ పట్టే యంత్రాలు వర్ని మార్కెట్‌ కమిటీకి వచ్చాయి. అందులో యంత్రాల నుంచి 30 గల్లంతయ్యాయి. వీటితోపాటు యంత్రాలను కూడా అస్తవ్యస్తంగా పడేయంతో పనికిరాకుండా పోయాయి. మార్కెట్‌ కమిటీ ఆస్తులను కాపాడాల్సిన కార్యదర్శి తనకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయం.

చెక్‌పోస్టులోనే విధులు..

జల్లెడ యంత్రాల నుంచి మోటార్లు పోయిన విషయం వాస్తవమేనని ఎలా పోయాయో తనకు తెలియదని ఆ బాధ్యతను మరో కాంట్రాక్టు ఉద్యోగికి అప్ప జెప్పానని దాటవేయడం కొసమెరుపు. బాధ్యతగల కార్యదర్శి శ్రీనివాస్‌ ఆరు నెలల నుంచి తాను కార్యాలయానికి సరిగా రావడం లేదని మండల కేంద్రంలో ఉన్న చెక్‌ పోస్టులోనే విధులు నిర్వహిస్తున్నానని, కార్యాలయంలో ఏం జరుగుతుందో తనకు తెలియదని సమాధానం ఇవ్వడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం. సుమారు రూ. 5 లక్షల విలువ చేసే మోటర్లను కార్యదర్శి మరికొందరు కలిసి విక్రయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం మార్కెట్‌ కమిటీలో అగ్ని ప్రమాదం సంభవించి రూ. 16 లక్షల విలువగల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదం వెనుక భారీ కుంభకోణం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన వస్తువులను అమ్ముకొని అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు చూపించారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్‌ కమిటీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా మార్కెటింగ్‌ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరు ఎత్తుకెళ్లారో తెలియదు

మార్కెట్‌ కమిటీలో ఉన్న 30 వడపోత యంత్రాల మోటార్లు ఎలా మాయమయ్యాయో తెలీదు. నేను మార్కెట్‌ కమిటీ చెక్‌ పోస్టులోనే ఉంటున్నాను. కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలీదు.

– శ్రీనివాస్‌, వర్ని మార్కెట్‌ కమిటీ కార్యదర్శి

ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం

వర్ని ఏఎంసీలో మోటార్లు మాయమైన విషయం తన దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

– గంగు, జిల్లా మార్కెటింగ్‌ అధికారి

కార్యదర్శి నిలదీత

వర్ని: మార్కెట్‌ కమిటీలో వడబోత యంత్రాల మోటార్లు గల్లంతైన విషయంపై కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కార్యదర్శి శ్రీనివాస్‌ను గురువారం నిలదీశారు.

కార్యాలయం నుంచి రూ. లక్షల విలువ చేసే మోటార్లు, ఇతర వస్తువులు కనబడకుండా పోతే ఏం చేస్తున్నారని నిలదీశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు, నాయకులు శ్రీనివాస్‌, ప్రశాంత్‌, దామినేని నాగేశ్వరరావు, రామకృష్ణ ఉన్నారు.


కార్యదర్శిని నిలదీస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

క్లుప్తంగా

మాక్లూర్‌ విండో పాలకవర్గానికి నోటీసులు

మాక్లూర్‌: మాక్లూర్‌ వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన అవకతవకలపై సంబంధిత అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. సొసైటీలో నాలుగేళ్ల నుంచి ధాన్యం కొనుగోళ్ల కమీషన్‌ దుర్వినియోగంతో పాటు, సొసైటీకి వచ్చిన ఎరువులను ప్రైవేట్‌ దుకాణాలకు తరలించారన్న ఫిర్యాదుతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో ప్రస్తుత చైర్‌ పర్సన్‌ గోపు లక్ష్మి రూ.58.87 లక్షలు దుర్వినియోగం చేసినట్లు తేలింది. అలాగే గతంలో పనిచేసిన చైర్మన్లు దయాకర్‌రావు రూ.7.94 లక్షలు, రమణారావు రూ.13.75 లక్షలు దుర్వినియోగం చేశారని విచారణలో గుర్తించారు. ఈ ముగ్గురితో పాటు ఆ సమయంలో సొసైటీ సీఈవోగా పని చేసిన విష్ణువర్ధన్‌కు అధికారులు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా డబ్బులను సొసైటీకి చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. అలాగే ప్రతి నెల జరిగే జమా ఖర్చుల సమావేశంలో అవకతవకలపై నిలదీయకుండా ఎలా సంతకాలు చేశారంటూ డైరెక్టర్లకు కూడా నోటీసులు అందించారు.

రేపు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాస్థాయి జూనియర్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపిక పోటీలు ఈ నెల 20న రెంజల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్‌, శ్యామ్‌ గురువారం తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఆర్గనైజింగ్‌ సెక్రటరీ కృష్ణమూర్తికి రిపోర్టు చేయాలన్నారు.

ఆన్‌లైన్‌లో రాష్ట్రీయ బాల్‌ వైజ్ఞానిక ప్రదర్శన



నిజామాబాద్‌ అర్బన్‌ : జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల్‌ వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ఆన్‌లైన్‌లో జరగగా దానికి డీఈవో గురువారం డీఈవో దుర్గాప్రసాద్‌ పరిశీలించారు. ఈ ఏడాది ప్రదర్శనను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని రాష్ట్ర పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశించింది. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 250 ప్రదర్శనల కోసం రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. ఈ విద్యార్థులకు రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌ ద్వారా వారి ప్రదర్శనలను పరిశీలిస్తామని డీఈవో దుర్గాప్రసాద్‌ తెలిపారు. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ ఫర్‌ సొసైటీ, ఆరోగ్యం, లైఫ్‌, వ్యవసాయం, ట్రాన్స్‌మీటర్‌ అండ్‌ కమ్యూనికేషన్‌, కాంపిటేషనల్‌ థింకింగ్‌ అనే ఉప అంశాలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలు 23, 24 తేదీల్లో రంగారెడ్డిలో ఉంటాయన్నారు. ఇదే కార్యక్రమంలో మిల్లెట్స్‌ ఫర్‌ సస్టైనబుల్‌ డెవలప్మెంట్‌ అనే అంశంపై సెమినార్‌ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జెడ్పీహెచ్‌ఎస్‌ బోర్గాం (పి) పాఠశాల కేంద్రాన్ని డీఈవో పాటు అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్‌ బోర్గాం(పి) శంకర్‌, లక్ష్మీనాథం, గోవర్ధన్‌, లక్ష్మణ్‌, సాయిబాబా, శ్రీనివాస్‌, సనావుద్దీన్‌, కాంతారావు, జిల్లా సైన్స్‌ అధికారి కస్తూరి గంగా కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్‌ కళాశాల తనిఖీ

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రంలోని జూనియర్‌ కళాశాలను జిల్లా నోడల్‌ అధికారి షేక్‌ సలాం గురువారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేపట్టాలన్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టులో విత్తన, పురుగుల మందులు, ఎరువులపై కొత్త కేసులు, నూతన చట్టాలపై మండల వ్యవసాయ అధికారులకు జిల్లా అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కుష్బూ ఉపాధ్యాయ గురువారం అవగాహన కల్పించారు. కేసుల విషయంలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎండీ రహీముద్దీన్‌, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాస సమావేశం వాయిదా

మాక్లూర్‌: ఎంపీపీ మాస్త ప్రభాకర్‌పై ఈ నెల 19న నిర్వహించాల్సిన అవిశ్వాస సమావేశం తాత్కాలికంగా వాయిదా పడినట్టు ఎంపీడీవో జె క్రాంతి గురువారం తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీకి చెందిన మదన్‌పల్లి ఎంపీటీసీ గోపూరు ఒడ్డెన్న, మాక్లూర్‌ ఎంపీటీసీ ఎస్‌ వెంకటేశ్వర్‌రావు, మరో 7గురు ఎంపీటీసీలు మొత్తం 9 మంది కలెక్టర్‌ను ఇటీవల కలిసి అవిశ్వాసానికి అనుమతి కోరారు. ఈ నెల 19న అవిశ్వాసం పెట్టేందుకు అనుమతి లభించగా ఎంపీపీ ప్రభాకర్‌ కోర్టును ఆశ్రయించారు. దీంతో తాత్కాలికంగా శుక్రవారం జరగాల్సిన అవిశ్వాస తీర్మాణ సమావేశం వాయిదా పడింది. తదుపరి సమావేశం ఎప్పుడు అనేది తెలియజేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

జరిమానాలు చెల్లించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు, ఓంపాల్‌

డిచ్‌పల్లి: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల 13వ రౌండ్‌ సోషల్‌ ఆడిట్‌ (సామాజిక తనిఖీ)లో వెల్లడైన అక్రమాలకు సంబంధించి రికవరీ, ఫెనాల్టీ, ఎక్స్‌ప్లనేషన్స్‌ను ఈ నెలాఖరునాటికి అందజేయాలని ఈజీఎస్‌ అంబుడ్స్‌మెన్‌ శ్రీనివాసరావు, ఏపీడీ ఓంపాల్‌ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోషల్‌ ఆడిట్‌లో తేలిన ప్రకారం ఇన్‌చార్జి ఈసీ, టెక్నికల్‌ అసిస్టెంట్‌ (టీఏ) బి.వినోద రూ.45,087, టీఏలు రాజేశ్వర్‌ రూ.55,880, వి.సంపూర్ణ రూ.9,152తో సహా మిగిలిన వారి వద్ద మొత్తం రూ.1,24,091 రికవరీ చేయాల్సి ఉందన్నారు. మరికొందరు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రికవరీ, ఫెనాల్టీలతో పాటు ఉపాధి పనులకు సంబంధించి వివరణ (ఎక్స్‌ప్లనేషన్స్‌)ను ఈ నెలాఖరులోగా అందజేయాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో సుధాకర్‌రెడ్డి, టీఏలు కుందెన్‌ ఉమేశ్‌, సాయికుమార్‌, వినోద, రాజేశ్వర్‌, కంప్యూటర్‌ ఆపరేటర్లు అన్నపూర్ణ, అనూష, ఫీల్డ్‌ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఎండీని కలిసిన జేఏసీ నాయకులు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో నిర్వహించిన విద్యుత్‌ సమీక్ష సమావేశానికి హాజరైన టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ నూతన సీఎండీ వరుణ్‌రెడ్డిని జిల్లా విద్యుత్‌ జేఏసీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. సీఎండీని కలిసిన వారిలో జేఏసీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్‌ తోట రాజశేఖర్‌, 1104 కంపెనీ అధ్యక్షుడు రఘునందన్‌, శివాజీ గణేశ్‌, బాలేశ్‌ కుమార్‌, జి శ్రీనివాస్‌, ఎడ్ల నాగరాజు, గంగారాం నాయక్‌, ఎం అశోక్‌, రాజేందర్‌, ఆర్‌ చంద్రశేఖర్‌, రాజేందర్‌, జాకీర్‌ అలీ, నాగరాజ్‌, రమణ, హకృష్ణ, శివ కుమార్‌, రవి కిశోర్‌, జ్ఞానేశ్‌, ప్రసాద్‌, నగేశ్‌, రాకేశ్‌ పాల్గొన్నారు.

21న ఖోఖో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాస్థాయి సీనియర్‌ మహిళ, పురుషుల విభాగంలో ఖోఖో పోటీలను ఈ నెల 21న బోధన్‌లో ఉంటుందని జిల్లా అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ భూమారెడ్డి, ఎండీ అతీకుల్లా గురువారం తెలిపారు. ఈ పోటీలను కాకతీయ చేయూత చారిటబుల్‌ ట్రస్ట్‌ బోధన్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ఆధార్‌ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8555996271, 7396541233, 9676269988 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్‌

తల్లీకూతురు అదృశ్యం

బాల్కొండ: మెండోరా మండలం నెహ్రూనగర్‌ కాలనీకి చెందిన సంగెం రమాదేవి ఆమె కూతురు అక్షయ అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం కూతురుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిన రమాదేవి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి సయ్యద్‌ ఖదీర్‌ విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ గురువారం తెలిపారు. కోర్టులో 10 కేసులకు సంబంధించి 8 గురికి రూ. 8600 జరిమానా విధించగా రెండు కేసులలో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన కోనె మహేందర్‌, పులాంగ్‌కు చెందిన షేక్‌ అన్వర్‌కు జైలు శిక్ష పడిందని చెప్పారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు టిప్పర్లు, జేసీబీ పట్టివేత

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గాంధీనగర్‌ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లు, జేసీబీని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు గురువారం దాడి నిర్వహించి పట్టుకున్నారు. ఈ వాహనాలను సీజ్‌ చేసి రూరల్‌ పీఎస్‌కు తరలించినట్లు రూరల్‌ ఇన్‌చార్జి ఎస్సై రామారావు తెలిపారు.

అన్నారంలో ఆటో బోల్తా



రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామ శివారులో గురువారం రాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆటో అన్నారం నుంచి రెడ్డిపేటకు వెళ్తుండగా అన్నారం ఎల్లమ్మ ఆలయం ఎదుట అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా గ్రామస్తులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అపరిచితులు కనిపిస్తే సమాచారమివ్వాలి



బాల్కొండ: గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ముప్కాల్‌ ఎస్సై భాస్కరాచారి సూచించారు. మండల కేంద్రంలోని పీఎస్‌ ఎదుట గురువారం నిర్వహించిన 'నేను సైతం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ ధరించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్‌


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సాయిరెడ్డి

ఖలీల్‌వాడి: నవీపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రాయిచూర్‌ రైలులో నిద్రిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగును చోరీ చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైలులో నిద్రిస్తున్న మహిళ బ్యాగును నవీపేట్‌కు చెందిన షేక్‌ సలీం చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా షేక్‌ సలీంకు చెందిన ఫోన్‌ ఆధారంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్‌, ల్యాప్‌టాప్‌, గుర్తింపు కార్డులను రికవరీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో సిబ్బంది మహబూబ్‌, రవి కిరణ్‌, రాములు, నాజ్మ, సలావుద్దీన్‌ ఉన్నారు.

సెల్‌ఫోన్‌ చోరీ కేసులో..

సెల్‌ఫోన్‌ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఈ నెల 17న రాత్రి 1.30 నిమిషాలకు ప్రయాణికుడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించిన నిందితుడిని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని జిల్లా కేంద్రానికి చెందిన పిల్లి శ్రీకాంత్‌గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసులో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది హన్మాండ్లు, రవికిరణ్‌, రాములు, సీనా, శరత్‌ బాబును అభినందించారు.


అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



సాయిలు(ఫైల్‌)

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్‌ కాలనీకి చెందిన డాంకె సాయిలు(58) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలంలో వరినాట్లు వేసిన కూలీలకు డబ్బులు చెల్లించేందుకు గురువారం ఇంటి నుంచి వెళ్లిన సాయిలు తిరిగి రాలేదని, తన స్నేహితుడు చాంద్‌పాషాతో కలిసి సంజీవ్‌రెడ్డి కమర్షియల్‌ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న బెల్ట్‌ షాప్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ అపస్మారక స్థితిలో ఉన్న సాయిలుని బెల్ట్‌షాప్‌ నిర్వాహకుడు సంజీవ్‌రెడ్డే హత్య చేశాడని బాధిత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. నవీపేటలోని రెండు వైన్స్‌లకు చెందిన యజమానులు బెల్ట్‌ షాప్‌ నిర్వాహకుడు సంజీవ్‌రెడ్డితో ములాఖతై అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని మండిపడ్డారు. సంజీవ్‌రెడ్డితో పాటు అక్కడ పనిచేసే అశోక్‌, నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సీఐ వెంకటరమణ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

దాడి ఘటనలో తీవ్రగాయాలై..

- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- న్యాయం చేయాలని బంధువుల ఆందోళన


సూర్యకాంత్‌ (ఫైల్‌)


విచారణ చేపడుతున్న ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: చిన్న విషయంలో మాటా మాటా పెరిగి జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు 20 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని డిగ్రీ కళాశాల ఎదుట వాగ్మారే సూర్యకాంత్‌ (25) ఓ ఫర్నిచర్‌ దుకాణం నడిపిస్తున్నాడు. గత నెల 29 అర్ధరాత్రి పట్టణానికి చెందిన కొందరు యువకులు దుకాణం సమీపంలో మూత్రవిసర్జన చేస్తుండగా సూర్యకాంత్‌, అతని తమ్ముడు శివ ప్రశ్నించారు. ఇది గొడవకు దారితీసింది. మాటా మాటా పెరిగి నరేందర్‌, రాకేశ్‌, ప్రణీత్‌, మనోజ్‌, మరో మైనర్‌ యువకుడు కలిసి అన్నదమ్ములపై దాడి చేశారు. దాడిలో సూర్యకాంత్‌ తీవ్రంగా గాయపడడంతో ఆదేరోజు ఏరియా ఆస్పత్రికి, ఆ తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఇటీవల ఇంటికి తీసుకొచ్చి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. గురువారం పరిస్థితి విషమించడంతో ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబీకులు దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌ రెడ్డి అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. నిందితులు పరారీలో ఉన్నారని వారిపై సెక్షన్‌ 302 ప్రకారం హత్యకేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోచారం కాలువ డిస్ట్రిబ్యూటరీ మూసివేత



నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రధానకాలువకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ–1ను ఇరిగేషన్‌ సిబ్బంది గురువారం రాత్రి మూసేశారు. నిబంధనల ప్రకారం.. ఈ యేడు యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు నీటిని ఆయకట్టు పరిదిలోని 'బీ'జోన్‌ భూములకు కేటాయించారు. ఈ నేపథ్యంలో 'ఏ'జోన్‌ పరిధిలోని ప్రధానకాలువ డిస్ట్రిబ్యూటరీలను ఇరిగేషన్‌ సిబ్బంది మొరంపోసి తాత్కాలికంగా మూసేశారు. కానీ గుర్తుతెలియని వ్యక్తులు గురువారం డిస్ట్రిబ్యూటరీ–1లో పోసిన మొరాన్ని తొలగించి అక్రమంగా తెరిచారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్‌ అధికారులు రాత్రి అక్కడికి చేరుకొని సిబ్బందితో డిస్ట్రిబ్యూటరీని మూయించారు. మూసేసిన డిస్ట్రిబ్యూటరీలను ఎవరైనా అక్రమంగా తెరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇరిగేషన్‌ డీఈఈ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

సొసైటీ సభ్యులకు శిక్షణ



సుభాష్‌నగర్‌: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సుపరిపాలన విధానంపై సొసైటీ చైర్మన్లు, పాలకవర్గసభ్యులకు గురువారం డీసీసీబీలో కో–ఆపరేటీవ్‌ ట్రెనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌ (సీటీఐ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీటీఐ ఫ్యాకల్టీ సభ్యులు విజయ్‌శంకర్‌, సుబ్బారావు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు అందించాల్సిన మరిన్ని సేవలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ నాగభూషణం, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్‌, జీఎంలు యాదగిరి, సూర్యప్రకాశ్‌, సొసైటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై అవగాహన కల్పించాలి

- కామారెడ్డి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌



కామారెడ్డి క్రైం: రైతులు కొత్త వరి వంగడాలు సాగు చేసేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం క్యాలెండర్‌, డెయిరీలను గురువారం ఆవిష్కరించారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, చేపల చెరువులు ఏర్పాటు చేసుకొని అదనంగా ఆదాయం పొందేలా చూడాలన్నారు. చిరుధాన్యాలు, కూరగాయల సాగు ఎక్కువగా చేపట్టేలా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా చైర్మన్‌ భాగ్యలక్ష్మి, అధ్యక్షుడు నర్సింహులు, ఏడీఏలు రత్న, అపర్ణ, భారతి, ఏఓలు ప్రజాపతి, హరీశ్‌కుమార్‌, శ్రీకాంత్‌, విజయ శేఖర్‌, పవన్‌, రాధా, రమ్య పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొల్కంపేట గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు.. మెదక్‌ జిల్లా మక్త భూపతిపూర్‌కు చెందిన ఆకుల ప్రభాకర్‌(35) తొమ్మిది రోజుల క్రితం పొల్కంపేటలో తన సోదరి మాసుల సరిత ఇంటికి వచ్చాడు. ప్రభాకర్‌ తన స్వగ్రామంలో ఇల్లు కట్టుకున్నాడు. ఈ క్రమంలో అప్పులయ్యాయి. అప్పులు తీర్చడానికి కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్‌ అక్కడి నుంచి నేరుగా తన సోదరి ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీరడం లేదని మనస్తాపంతో సోదరి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఆకుల లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.